క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ గ్రామంలో నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు పార్థివ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో వచ్చి పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాపూర్: లింగాపూర్, సిర్పూర్, జైనూర్ మండలాల్లో 33/11కేవీ ఉపకేంద్రంలో నెలవారి మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ సల్ల ఆదర్శ ఒక ప్రకటనలో తెలిపారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల వల్ల శనివారం మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ కమలాకర్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యూనిఫామ్ అందజేత


చొపన్‌గూడలో యూనిఫామ్‌లు అందజేస్తున్న ఎంఎన్‌వో

కెరమెరి: మండలంలోని సుర్దాపూర్, చొపన్‌గూడ, సుల్తాన్‌గూడ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. వీవో సంఘ సభ్యులు విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టడం ఈ నెల 10లోగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభం రోజు విద్యార్థులందరికి యూనిఫామ్‌లు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, ఐకేపీ సీసీలు శంకర్, సుబ్బారావు, వీవో సభ్యులు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం


సిద్దాల దేవయ్య


వార్ల తిరుపతి

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన చైర్మన్‌గా సిద్దాల దేవయ్య, వైస్‌చైర్మన్‌గా వార్ల తిరుపతి, సభ్యులుగా షేక్ అబ్దుల్ సమీర్, కస్తూరి సత్యనారాయణ, కాసనిగొట్టు సంతోశ్, రాపల్లి రామయ్య, చెమ్మకరి తోగయ్య, ఆత్రం రాజారాం, బొబ్బల హారిక, గోమాస తిరుపతి, శంకర్, వెంకటరమణ, మధుసూదన్, మైలారపు మురళీధర్‌లు నియామకమయ్యారు.

'గ్రామాలాభివృద్ధే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం'


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కౌటాల: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గోవర్‌హెట్టి గ్రామంలో మొరం రోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు వసతులు కల్పిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.10.5 లక్షల నిధులతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సునీల్, తిరుపతి, నానాజీ, చంపత్, దత్తు, సంతోశ్, నితేశ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులకు రక్షణేది..?

- నీటికోసం ఊళ్లలోకి వస్తున్న అడవి జంతువులు
- వీధికుక్కల దాడుల్లో మృత్యువాత పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు


సిర్పూర్(టి) ప్రాంతంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దుప్పి (ఫైల్)


కాగజ్‌నగర్ ప్రాంతంలో కుక్కల దాడిలో మృతి చెందిన దుప్పి (ఫైల్)

కౌటాల: జిల్లాలోని అడవుల్లో ఎండాకాలం జింకలు, ఇతర అటవి జంతువులకు తాగునీరు దొరకడం కష్టంగా మారింది. వేసవిలో వన్యప్రాణులకు తాగునీరు అందించేందుకు గతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు (సాసర్‌పిట్స్) నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారాయి. ఎండలు మండుతున్న నేపథ్యంలో దాహార్తి తీర్చుకునేందుకు జంతువులు గ్రామాల్లోకి వచ్చి కుక్కల దాడుల్లో మృత్యువాత పడుతున్నాయి. గత కొద్ది రోజుల్లోనే మూడు జింకలు మృత్యువాత పడడం గమనార్హం. ఏటా జిల్లాలో దుప్పులు, జింకలు వీధి కుక్కల దాడిలో మృతి చెందుతున్నా సంబంధిత అధికారులు తమకు పట్టనట్లు ఉంటున్నారు.

వన్యప్రాణులపై దాడులు

జిల్లాలోని కాగజ్‌నగర్ డివిజన్ సరిహద్దుల్లో ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా, పెద్దవాగులు ప్రవహిస్తున్నాయి. అటవీ జంతువులు సంచరించేందుకు అనువైన ప్రాంతంగా ఉండడంతో పెద్దపులులు, జింకలు, మెకాలు, దుప్పులు, ఎలుగుబంట్లు, అడవి పందులు, సాంబార్లతో పాటు అనేక రకాల పక్షులు ఆవాసంగా మార్చుకొని ఇక్కడ జీవనం సాగిస్తున్నాయి. డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, దహెగాం, బెజ్జూర్, చింతలమానెపల్లి మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో అడవులు ఉండగా ఇక్కడ వన్యప్రాణులు మనుగడ సాగిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఆవాసంగా ఏర్పాటు చేసుకున్న వన్యప్రాణులను ఓవైపు వేటగాళ్లు విద్యుత్ తీగలు, ఉచ్చులు, విష ప్రయోగం, నాటు బాంబులతో వేటాడుతున్నారు. మరోవైపు వీధి కుక్కల బారిన పడి వన్యప్రాణులు మృతి చెందుతున్నాయి. అటవీశాఖ అధికారుల నిఘా అంతంత మాత్రంగానే ఉండడంతో వన్యప్రాణులకు రక్షణ లేకుండా పోతోందని జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు.

వేటాడి.. చంపేసి..

గ్రామాల్లో వీధి కుక్కల బెడద పెరిగింది. కుక్కల నివారణ కోసం పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. వీధి కుక్కలు మనుషులతో పాటు వన్యప్రాణులపై దాడులు చేస్తూ భీబత్సం సృష్టిస్తున్నాయి. గతంలో అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు సాసర్ పిట్స్ ఏర్పాటు చేశారు. కానీ వీటిలో నీళ్ల నింపేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నీళ్లు అందుబాటులో ఉంచారు. దీంతో మిగితా ప్రాంతాల్లోని వన్యప్రాణులు దాహార్తి కోసం ఊళ్లల్లోకి వస్తున్నాయి. దీంతో కుక్కలు వాటిపై దాడులు చేస్తున్నాయి. అటవీశాఖ అధికారులు వన్యప్రాణులను కాపాడాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు. అటవీ జంతువులను కాపాడాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారులదేనని, మా ప్రాంతాల్లో వీధికుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పంచాయతీ అధికారులు పేర్కొంటున్నారు. వన్యప్రాణుల సంరక్షణపై చర్యలు తీసుకుంటున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

వరుస సంఘటనలు

- గత నెల 16న సిర్పూర్(టి) అటవీ ప్రాంతంలో పెద్దబండ సమీపంలో కాగజ్‌నగర్ –సిర్పూర్(టి) ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని దుప్పి అక్కడిక్కడే మృతి చెందింది. అటవీ ప్రాంతం నుంచి జింక రోడ్డు దాటుతున్న క్రమంలో ప్రమాదం బారిన పడింది.
- కాగజ్‌నగర్ మండలంలోని కడంబా అటవీ ప్రాంతంలో గత నెల 26న కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. కడంబా భీమన్న ఆలయం సమీపంలోకి చుక్కల దుప్పి రాగా.. అక్కడే కాపు కాసి వీధి కుక్కలు దాడి చేసి దుప్పిని చంపేశాయి.
- కాగజ్‌నగర్ మండలంలోని అనుకోడ అటవీ ప్రాంతంలో ఈ నెల 1వ తేదీన వీధి కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతి చెందింది. తాగునీటి కోసం అటవీ నుంచి గ్రామ శివారు ప్రాంతానికి వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు వేటాడి దాడి చేసి చంపేశాయి.

అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

తిర్యాణి: మండల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్‌తో కలిసి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ అడవిపై ఆధారపడి జీవించే ఆదివాసీలు ఫారెస్టు అధికారుల తీరుతో ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా క్షేత్రస్థాయిలో తగు చర్యలు చేపట్టడంతో పాటు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. త్రీ ఇన్‌క్లెయిన్ నుంచి సమ్మక్క గద్దల వరకు రోడ్డు మరమ్మతు పనులకు ఫారెస్టు అధికారులు అనుమతులు లేవని అడ్డుకోవడం సరికాదన్నారు. మండలంలోని చింతల మాదర గ్రామంలో ఇంటికి చేరువలో విద్యుత్ లైన్లు ఉన్నాయని వాటిని సవరించాలని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి క్షేత్రస్థాయిలో మెరుగైనా సేవలు అందించాలన్నారు. జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యుత్ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యుత్ కోతలు ఉన్నప్పుడు కనీస సమాచారం ఇవ్వక పోవడంతో పాటు ఫోన్ చేసినా ఎత్తడం ఆరోపించారు. రైతులకు పత్తి విత్తనాలు దొరకకుండా వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎమ్మార్పీ కన్న అధికంగా వసూలు చేస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ఆరోపించారు. సమావేశంలో ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి, వైస్ ఎంపీపీ కోవ పార్వతి తదితరులు ఉన్నారు.

అధికారులు ప్రజాసమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ

వాంకిడి: అధికారులు ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ముండె విమలబాయి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంతో పాటు అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు రాకపోవడంపై ఏఈ శైలేందర్‌పై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. పైప్‌లైన్‌లు వేసి నల్లాలు బిగించలేదని, కొన్ని గ్రామాల్లో పథకం ప్రారంభమైనప్పటి నుంచి నీటి సరఫరా చేయలేదని, అనేక చోట్ల పైప్‌లీకేజీలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు సభా దృష్టికి తీసుకెళ్లారు. ఖమాన గ్రామ శివారులో ఓ రైతు చేనులో నుంచి తీసిన సాగు నీటి కాలువను అసంపూర్తిగా వదిలేయడంతో ఏటా రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని, ఇరిగేషన్ సిబ్బందికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ హివ్రె ప్రవీణ్ సమస్యను సభా దృష్టికి తీసుకెళ్లారు. మండలంలో పత్తి విత్తనాలు అధిక రేట్లకు అమ్మి డీలర్లు రైతులను మోసం చేస్తున్నారన్నారు. రైతులు కోరిన విత్తనాల కొరత చూపి ఎమ్మార్పీ కంటే ఎక్కువ వసూళ్లు చేస్తున్నారని సభ్యులు ఆరోపించారు. అధికారులు దృష్టి సారించి డీలర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులు శాఖా పరమైన నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, ఎంపీడీవో వివి వరలక్ష్మి, ఎంఈవో మనుకుమార్, ఏపీవో శ్రావణ్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బడీడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వీవో సభ్యులు

కెరమెరి: బడిని బతికించే బాధ్యత వీవో సంఘ సభ్యులదేనని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సుర్దాపూర్, చొపన్‌గూడ, ఝరి, సుల్తాన్‌గూడ, నెహ్రూనగర్‌లో కొనసాగిన బడిబాట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బడీడు పిల్లలు బడిలో ఉండే విధంగా చూడాలన్నారు. వీవో సభ్యులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

కౌటాల: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని హెచ్‌ఎం గావుడే హన్మంతు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ముత్తంపేట, కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేత


పుస్తకాలు అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు అందించాలని మండల పాఠ్యపుస్తకాల పంపిణీ నోడల్ అధికారి ఉదయ్ బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాల బుక్స్ డిపో నుంచి సంబంధిత పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం నాటికి ప్రతీ పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పాఠశాలల్లో ఉండాలని తెలిపారు. విద్యార్థులకు సకాలంలో పాఠ్య పుస్తకాలు ఏకరూప దుస్తులు అందించాలని పేర్కొన్నారు. మండలంలోని 14 యూపీఎస్, 2 పీఎస్ పాఠశాలలకు పుస్తకాలను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ సంతోష్, సీసీవో అనూప్ కుమార్, సీఆర్పీలు తిరుపతి, స్వప్న, ప్రవళిక, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నార్నూర్: గాదిగూడ ఎంపీపీ ఆడ చంద్రకళ రాజు అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సరైన కోరం లేక వాయిదా పడింది. త్వరలో మరో తేదీని ప్రకటిస్తామని ఎంపీపీ తెలిపారు. అనంతరం అక్కడే వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా గ్రామీణ ప్రాంతాల్లో శానిటేషన్, క్లోరినేషన్‌పై ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీ చేపడుతున్న పాఠశాల అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించేలా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, గాదిగూడ, ఝరి పీహెచ్‌సీ వైద్యాధికారులు సంజీవ్, ప్రవీణ్ కుమార్, ఐకేపీ ఏపీఎం మాధవి, ఈజీఎస్ ఏపీవో నితిన్ కుమార్, ఎంఈవో రాపల్లి ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇసుళ్ల వేట..!


ఇసుళ్లను పడుతున్న చిన్నారులు

అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు ఎక్కువగా వివిధ రకాల ఫలాలు, జంతువులపై ఆధారపడి జీవిస్తుంటారు. వారు ఎండాకాలం ముగిసి వర్షాకాలం ప్రారంభమయ్యే సమయంలో వచ్చే ఇసుళ్లను పట్టుకొని వేయించి ఎంతో ఇష్టంగా తింటారు. లైట్లు, దీపం వెలుతురులో వాటిని పడుతుంటారు. ఏజెన్సీలోని కెరమెరి మండలం చిన్నపాట్లాపూర్ గ్రామంలో చిన్నారులు, యువతులు ఇసుళ్లను పట్టారు. దేవుడు ఇచ్చే ఆహారంగా వాటిని భావిస్తామని ఈ సందర్భంగా గిరిజనులు పేర్కొంటున్నారు.

– దహెగాం

సొంత భవనాలు కరువు

- తిప్పలు పడుతున్న పొదుపు సంఘాల సభ్యులు
- శిథిలావస్థ భవనాల్లో నిర్వహణ


ఇంటి ఆవరణలో నిర్వహిస్తున్న సమావేశం (ఫైల్)

లింగాపూర్: మహిళా పొదుపు సంఘాలకు సొంత భవనాలు లేక సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామైక్య సంఘాలకు భవనాలు నిర్మించాలని సభ్యులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలు కొనసాగుతున్నాయి. సమావేశాల నిర్వహణకు సరైనా వేదిక లేకపోవడంతో చెట్ల కింద, సంఘం సభ్యుల ఇళ్లల్లో సమావేశాలు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మండల పరిధిలోని 14 గ్రామపంచాయతీల్లో 18 గ్రామైఖ్య సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 268 స్వయం సహాయక సంఘాలు ఉండగా.. 3200 మంది సభ్యులు ఉన్నారు. స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా మహిళలు జీవనోపాధి పొందుతూనే పొదుపులో ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల మంజూరు, వసూలు, సభ్యులలో చైతన్యం పెంపొందించడంలో కీలకపాత్ర పోషించే సంఘాలకు సొంత భవనం లేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

వెంటాడుతున్న సమస్యలు..

సొంత భవనాలు లేక సంఘాల కార్యక్రమాల నిర్వహణతో పాటు మహిళా సమాఖ్యలు, మహిళా పొదుపు సంఘాల సమావేశాల నిర్వహణ, శిక్షణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామైఖ్య సంఘాల వద్దకు వివిధ పనుల కోసం వచ్చే మహిళా సంఘాల సభ్యులు మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు లేకఅవస్థలు పడుతున్నారు. లింగాపూర్ మండల కేంద్రంగా ఏర్పాటై ఎనిమిదేళ్లు గడుస్తున్నా వివిధ సంఘాల సమావేశాల నిర్వహణకు మండల కేంద్రంలో శిథిలావస్థకు గురైనా ఆసుపత్రి భవనంలో జైజగదాంబ మండల సమాఖ్య కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. స్థానికంగా సంఘ పక్కా భవనా న్ని నిర్మించాలని సంఘాల సభ్యులు కోరుతున్నా రు.

మండలంలో ఇలా..

2016లో నూతనంగా ఏర్పాటైన లింగాపూర్ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సైతం పక్కా భవనాలు కరువయ్యాయి. మండల కేంద్రంలోని తహసీల్దార్ భవనం పురాతన పాఠశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో కార్యాలయాన్ని గ్రామపంచాయతీ భవనంలో నిర్వహిస్తుండడంతో సౌకర్యాలు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వానికి నివేదించాం

స్వయం సహాయక సంఘాల నిర్వహణ కోసం సొంత భవనాలు నిర్మించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. సంఘాల సభ్యులు పడుతున్న ఇబ్బందులను తెలియజేశాం. భవన నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం.

– దేవానంద్, ఏపీఎం, లింగాపూర్

కృత్రిమ కాలు ఏర్పాటు


ఆత్రం భుజంగ్‌రావుకు కృత్రిమ కాలు ఏర్పాటు చేసిన పోలీసులు

బెజ్జూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామ వాసి ఆత్రం భుజంగ్ రావు గతేడాది ప్రమాదవశాత్తు తన కాలు కోల్పోయాడు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎస్పీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై విక్రమ్ అతనికి జైపూర్ కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులు రమేశ్, రుషి, పోలీసు సిబ్బంది విజయ్, మహేశ్, శంకర్‌లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఉట్నూర్‌రూరల్: అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగాడా వివిధ శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖానాపూర్ నియోజకవర్గంలో తాగునీటి కోసం సుమారు 5 కోట్ల వరకు నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. విద్య, వ్యవసాయ, వైద్య రంగాన్ని అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.

చెక్‌పోస్ట్ ఏర్పాటు

చింతలమానెపల్లి: పశువుల అక్రమ రవాణా అడ్డుకునేందుకు మండలంలోని అడెపల్లి వద్ద శుక్రవారం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. మహారాష్ట్ర నుంచి మండలంలోని ఆయా మార్గాల గుండా కాగజ్‌నగర్‌కు పశువులను అక్రమంగా రవాణా చేసే అవకాశాలు ఉన్నందున చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తామని చెక్‌పోస్ట్ సిబ్బంది తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలించవద్దని హెచ్చరించారు. చెక్‌పోస్ట్‌ను కౌటాల సీఐ సాదిక్‌పాషా పరిశీలించారు. చెక్‌పోస్ట్ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.

గాలివాన బీభత్సం

నార్నూర్: గాదిగూడ మండలంలోని గౌరీ గ్రామంలో గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ చెట్లు విరిగిపడడంతో ఇంటిపై కప్పులు ఎగిరిపోయాయి.

ఎరువుల దుకాణాలు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏఈవో శ్రీవిద్య

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్, ఎల్కపల్లి, చేడ్వాయి, గొంట్లపేట్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను వ్యవసాయ విస్తరణ అధికారులు శ్రీవిద్య, గౌసియా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎరువుల దుకాణాల్లో ప్రతి కొనుగోలు, విక్రయాలకు రికార్డులు నమోదు చేయాలని సూచించారు. ప్రతీ కొనుగోలుకు రైతులకు రశీదులు అందించాలన్నారు. నిషేధిత విత్తనాలను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి కేసులను నమోదు చేస్తామని హెచ్చరించారు.